TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

హైదరాబాద్, 06.12.2014:

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం 'చంద్రం' భవన్‌లో టిఆర్‌సి 151వ చర్చగా **""రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు శ్రీ కె.వి.రమణాచారి గారితో ముఖాముఖి"కార్యక్రమం జరిగింది. ఈ చర్చలో ముందుగా జగన్నాథం కళా బృందం, వరంగల్ వారిచే కొయ్యబొమ్మల ప్రదర్శన జరిగింది.** ఈ సందర్భంగా **తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ శ్రీ వేదకుమార్ మాట్లాడుతూ**

300 సం॥లకు పైగా వీరి పూర్వీకుల నుండి ఈ కళ ప్రదర్శించబడుతోందని, ఈ కళా ప్రదర్శనను వారసత్వంగా తీసుకుని వారు దీనిని బ్రతికిస్తున్నారు.సమాజంలో ఉండే సమస్యలు, ప్రజల జీవన విధానాన్ని ఈ ప్రదర్శన ద్వారా తెలియజేస్తూ, ప్రజలకు విజ్ఞానం, సంతోషం కలిగించేవారు. వీరికి చదువు రాకపోయినా మౌఖికంగానే నేర్చుకుని ప్రదర్శనలు మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా వీరి కళను ప్రదర్శించారు. మనం చెప్పిన లేదా సమాజంలో జరిగిన అంశాల్ని తీసుకుని కథగా మలిచే గొప్ప కళా నైపుణ్యం కలిగినవారు. ఇంతకు ముందు వీరిని రాజులు, సంస్థానాధిపతులు పోషించేవారు. కానీ కాలక్రమేణా ఇప్పుడు ఈ కళకు ఆదరణ తగ్గి, పోషణ భారం పెరగడంతో మందమర్రి, ఆదిలాబాద్, మంచిర్యాల లాంటి ప్రాంతాల్లో తిరుగుతూ అల్యూమినియం పాత్రలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎంతో గొప్పదైన ఈ కళా సంపద కనుమరుగు కాకూడదనీ, ఈ కళను మన భవిష్యత్ తరాల వారికి అందించాలనీ, దీనిని బ్రతికుంచుకునే బాధ్యత మనందరిదీ.మన సంస్కృతినీ, కళారూపాల్ని రక్షించుకోవాలనీ తెలిపారు. ప్రభుత్వం వీరి కళను ఆదరించి, వీరికి రవాణా సౌకర్యాలు, గృహవసతులు మరియు పింఛన్లు కల్పించాలి అని కోరారు. ఈ ప్రదర్శన అనంతరం జగన్నాథం కళా బృందాన్ని శ్రీ కె.వి.రమణాచారి మరియు శ్రీ వేదకుమార్ లు సత్కరించారు.

**కొయ్యబొమ్మల ప్రదర్శనకారుడు శ్రీ జగన్నాథం మాట్లాడుతూ**

మేము కేవలం కొయ్యబొమ్మల ఆటనే కాకుండా భాగవతం, స్త్రీ వేషాలు, నాటక కళా ప్రదర్శనలు కూడా ఇస్తామని తెలిపారు. మమ్మల్ని ఎంతో గౌరవిస్తూ, ఆదరిస్తూ సొంత ఖర్చులతో మా కళా ప్రదర్శనలు ఇవ్వటానికి సహాయం అందిస్తున్న పెద్దలు గౌ॥ వేదకుమార్ గారికి ఎంతో రుణపడి ఉంటాం. కనుమరుగవుతున్న మా కళని బ్రతికించిన మహనీయులు. ఇలాంటి వారి ప్రోత్సాహంతో నిన్న మొన్నటివరకూ పట్టించుకోని మా కుమారులు మేంకూడా ఆడతాం అంటూ ముందుకు వస్తున్నారు. ఇలాంటి పరిణామం మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంపై కళా ప్రదర్శనలు ఇస్తూ ప్రజల్లో అవగాహన కలిగించటానికి మేము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వం మా కళను గుర్తించవలసినదిగా ఈ సందర్భంగా కోరారు.

**కె.వి.రమణాచారి మాట్లాడుతూ**

సినిమాలు, ఫేస్‌బుక్కులు , ట్విట్టర్లు చూడటంకాదు, ఇలాంటి సాంస్కృతిక, సాంప్రదాయ కళలను ఆదరించాలని, ఈ జీవుల జీవితాలను నిలిపి, సంస్కృతి, సాంప్రదాయాల్ని, కళలను నిలబెట్టేవారి కాళ్ళు మొక్కుతానని అన్నారు. తమ జీవితాల్ని కోల్పోతూ, ప్రజల జీవితాలలో జ్ఞానాన్ని, సంతోషాన్ని నిలిపే శక్తి కళాకారులకు ఉంది. వివిధ కులాలవారు వారి వృత్తులను వదిలివేసి, పట్నాలకు, విదేశాలకు వెళుతూ వారి మూలాలను, తల్లిదండ్రుల ఆత్మగౌరవాన్ని, కుల వృత్తులను వదిలివేస్తున్నారు, మరచిపోతున్నారు. అలా కాకుండా మన సంస్కృతిని, మూలాల్ని, తల్లిదండ్రుల పెద్దరికాన్ని నిలబెట్టి, వారి మూలాలను రక్షించుకోవాటానికి ముందుకు రావాలని కోరారు. లక్షలు, కోట్ల రూపాయలు తీసుకుంటూ నటించే వాళ్ళే నటులు అనుకుంటున్నారు. కానీ ఎలాంటి డబ్బు తీసుకోకుండా ప్రజల సంతోషం కోసం తమ జీవితాల్ని అంకితమిచ్చినవారు ఇటువంటి కళాకారులు అని అన్నారు. అనంతరం ఈ సందర్భంగా జగన్నాథం బృందానికి వ్యక్తిగతంగా 15,000 రూపాల పారితోషికం అందజేశారు. వీరి ప్రదర్శన నెలరోజులలోపు తెలంగాణ అంతటా ప్రదర్శించటానికి సహకారం అందించడానికి కృషి చేస్తానని అన్నారు.

TELANGANA
RESOURCE CENTRE
"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

**తదుపరి చర్చా కార్యక్రమంలో**

తెలంగాణ ఉద్యమం జరిగిన క్రమాన్ని తన విద్యార్థి జీవితం నుండి తాను ప్రత్యక్షంగా చూసిన అంశాలను తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమం గత కొన్ని దశాబ్దాల నుంచి ఏ విధమైన మలుపులు తీసుకుందో కూలంకుషంగా వివరించారు. తాను 16 ఏళ్ళ వయస్సు నుండే తెలంగాణ ఉద్యమంలో పాల్గొని సిద్ధిపేట ప్రజా సమితికి కార్యవర్గ సభ్యుడుగా పనిచేశానన్నారు. 1969-70 కాలం మధ్యలో 2 సం॥ల పాటు తాను జైలు జీవితం గడిపానని, 1970 తరువాత చెన్నారెడ్డికి పిఆర్ఓ గా చేశానని, చాలామంది ముఖ్యమంత్రుల వద్ద పిఆర్ఓగా చేశానని చెప్పారు. తెలంగాణను ఆశించిన అందరి కృషి ఫలితంగా తెలంగాణ సాధించడం, తరువాత ఏర్పడ్డ టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చడానికి అకుంఠిత దీక్షతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు గురించి విశదీకరించారు. దీంట్లో ప్రజల పాత్ర, వారి సలహా సహకారాలతో ఉండాలని కోరారు. ప్రాచీన కళలు మరియు సంస్కృతిపట్ల మక్కువ చూపిస్తూ వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆకాంక్షించారు. వివిధ సహజ సంపదలు, మరియు దేవాలయాల గురించి, ఇప్పుడున్న నిరుద్యోగులకు మంచి వేతనంతో బంగారు భవిష్యత్తు ఉండబోతుందని ఉద్ఘాటించారు.

ప్రశ్నా కార్యక్రమంలో:

ప్ర. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మన చారిత్రక కట్టడాలు రక్షించుకోవాలి. అందులో భాగంగా రామప్ప దేవాలయంలో అధ్యాత్మిక స్ఫూర్తి కలిగిన ఆఫీసర్ లేకపోవటంవలన దేవాలయ విశిష్ఠత తగ్గుతుంది. అన్ని చారిత్రక కట్టడాల్ని రక్షించడానికి చర్యలు తీసుకోండి

జ. చారిత్రక కట్టడాల విశిష్ఠత తగ్గుతుంటే చాలా బాధగా ఉంది. సోమవారంనాడే ప్రభుత్వం తరఫున వక్తిని పంపించి అక్కడి పరిస్థితుల్ని పరిశీలించి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం. అన్ని చారిత్రక కట్టడాల రక్షణకు కృషి చేస్తాను. మీరు కోరినట్లుగానే నెలరోజుల లోపు మంచి ఆఫీసర్‌ను అక్కడ నియమిస్తాను.

ప్ర. స్వామి అగ్నివేష్ లాంటి వ్యక్తి చరిత్ర కనుమరుగవుతోంది. దీనిపై చర్యలు తీసుకోండి

జ. ఇలాంటి వారి ఆశయాలు రక్షించడం మా బాధ్యత. ఆయన గురించి తెలుసుకుని ఖచ్చితంగా గుర్తింపునిస్తాం.

ప్ర. 2001లో 50 ఎకరాల భూమి ఇస్తే ఆంధ్ర పెత్తందారుల కారణంగా అది అన్యాక్రాంతం అయింది.

జ. మీరు లాండ్ కు సంబంధించిన పేపర్లతో వచ్చి కలిస్తే ఎవరిచేతికి వెళ్ళింది, ఏం అయిందనే విషయాన్ని కలెక్టర్ ద్వారా పరిశీలించి న్యాయం చేస్తాం.

ప్ర. సగ భాగమైన మహిళలు ప్రభుత్వ కార్యకలాపాల్లో లేరు. ఈ పరిస్థితిని మార్చటానికి ఏ విధమైన చర్యలు తీసుకుంటారు?

జ. ఇది బాధ కలిగించే విషయమే. 2015 ఫిబ్రవరి లోపు పరిష్కరిస్తాం ఎందుకంటే బడ్జెట్‌లో మీకు తగిన న్యాయం చేయటానికి ఉంటుంది కాబట్టి.

**తెలంగాణ రిసోర్స్ సెంటర్**